క్లుప్తంగా

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నాలుగో విడత ఆసరా చెక్కులను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పొదుపు మహిళలకు అందజేయనున్నట్లు ఏపీఎం పద్మావతి తెలిపారు. 600 పొదుపు గ్రూపుల్లోని 6,011 మంది సభ్యులకు రూ.4.62 కోట్ల చెక్కును అందజేస్తారని చెప్పారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

కలువాయి: స్థానిక తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీఓ ప్రభాకర్, ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు శుక్రవారం కలువాయి మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు కేంద్రాలతోపాటు కుల్లూరు ప్రభుత్వ పాఠశాలలో పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, ఫర్నిచర్, బాల బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉన్నాయా? లేవా అని పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంకటగిరిరూరల్: డక్కిలి, వెంకటగిరి, బాలాయపల్లె మండలాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

రాపూరులో..

రాపూరు: సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు.

గూడూరులో..

గూడూరురూరల్: పట్టణంతోపాటు రూరల్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు గూడూరు పట్టణ, రూరల్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిల్లకూరు మండలంలో...

మండలంలోని చిల్లకూరు, తిప్పగుంటపాళెం, అంకులపాటూరు, చింతవరం, వరగలిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీ ప్రసాద్ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



వైద్యుడితో చర్చిస్తున్న జిల్లా ప్రోగ్రామ్ అధికారి

సైదాపురం: నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యమని జిల్లా ప్రోగ్రామ్ అధికారి పీఎల్ దయాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రోగులతో సిబ్బంది అప్యాయంగా ఉండాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ పథకాలు వంద శాతం విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట వైద్యులు జనార్దన్ ఉన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

కలువాయి: మండల కేంద్రంలోని షిరిడీ సాయి బాబా మందిరంలో శుక్రవారం పదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయి భక్త బృందం ఆధ్వర్యంలో బాబాను పూలతో అలంకరించి, కాగడా హారతి, పాలాభిషేకం, సహస్ర నామార్చన, హోమగుండం, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నవితరణ చేశారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా తై అమావాస్య వేడుకలు

తడ: మాంబట్టులోని గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తై అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ చేశారు. హరికథా కాలక్షేపంతోపాటు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి గోపాలకృష్ణ శర్మ, త్రిపుర సుందరి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే పెద్ద మాంబట్టుకు చెందిన ఎస్ఆర్‌వి సాయి కార్తీక్ యాదవ్ అన్నదానానికి ఇచ్చిన రూ.2 లక్షల విరాళాన్ని పామల రాజయ్య, శకుంతల దంపతులు అన్నపూర్ణ అన్నదానం సమాజం నిర్వాహకులకు అందజేశారు. స్విమ్స్ వైద్యులు ము నుస్వామి, అన్నదాన ట్రస్టు అధ్యక్షుడు సీ దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య, పాల్గొన్నారు.

నేడు క్రికెట్ పోటీలు

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన సీనియర్లు ఏటా ఫిబ్రవరిలో నిర్వహించే క్రికెట్ పోటీలు శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. నిర్వాహకులు మధు, రఘు, మోహన్ మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు నిలిచిన వారికి నగదు బహుమతి అందజేస్తామన్నారు.

మాత్రలతో నులి పురుగుల కట్టడి

చిల్లకూరు: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులు నిర్మూలించవచ్చని చిల్లకూరు వైద్యులు ఆరాఫత్ సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చిల్లకూరులోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఆయన మాట్లాడుతూ నులి పురుగులతో పలు వ్యాధుల బారిన పడాల్సి వస్తుందన్నారు. చిన్న పిల్లలు మట్టిలో ఆడుకున్న తరువాత చేతులు శుభ్రం చేసుకునేలా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ఆరు నెలలకొకసారి ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు ఇస్తే కడుపులోని నులి పురుగులు చనిపోతాయన్నారు. ప్రిన్సిపల్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

శారీరక ఎదుగుదల ఎంతో అవసరం

డక్కిలి (బాలాయపల్లి): పిల్లలకు శారీరక ఎదుగుదల ఎంతో అవసరమని వైద్యాధికారులు జీ లిఖిత, వీ ప్రమీల పేర్కొన్నారు. బాలాయపల్లె జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ నులి పురుగులు పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. వాటి నివారణకు ఆల్బెండ్‌జోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండలంలో 5,300 మంది పిల్లలుకు గాను 5,233 మందికి ఆల్బెండ్‌జోల్ మాత్రలు అందించామన్నారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రాపూరులో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న ఎంపీడీఓ గంగయ్య

డక్కిలిలో మాత్రల పంపిణీ

మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆధ్వర్యంలో పిల్లలకు ఆల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని 6,402 మంది పిల్లలుకుగాను 6,375 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, గురుకుల ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారీ ఆల్బెండ్‌జోల్ మింగాలి

రాపూరు: ప్రతి చిన్నారి ఆల్బెండ్‌జోల్ మాత్రలు మింగాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. రాపూరు బాలికల గురుకులంలో చిన్నారులకు నులిపురుగుల మాత్రలను మింగించారు. ఆయన మాట్లాడుతూ 1–19 ఏళ్ల వయస్సున్న ప్రతి ఒక్కరికీ అల్బెండజోల్ మాత్రలు మింగించామన్నారు. వేపినాపి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ లింగమూర్తి మాట్లాడుతూ మండలంలో 9,735 మందిగాను 9,435 మందికి మాత్రలు మింగించామన్నారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

కోట: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈఓ మస్తానయ్య పర్యవేక్షణలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు మాత్రలు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నులిపురుగుల కారణంగా రక్తహీనత ఏర్పడకుండా మాత్రలు ఇస్తున్నట్లు తెలిపారు.

కలువాయిలో..

కలువాయి: మండలంలోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలువాయి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మండల వైద్యాధికారి డాక్టర్ రామకుమారి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పారిశుద్ధ్యంతో నులిపురుగులను నివారించవచ్చన్నారు. మండలంలోని 6,800 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.స్వర్ణ, ఎంపీడీఓ ప్రభాకర్, ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.






చిల్లకూరు: అల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న డాక్టర్ అరాఫత్, బాలాయపల్లె జెడ్పీ హైస్కూల్‌లో అల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్యాధికారి, కోట హైస్కూల్‌లో.., కలువాయిలో..

కండలేరులో 11.381 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 11.381 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ పూజలు



వీరరాఘస్వామికి పూజలు చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: పట్టుశాలీయుల ఆరాధ్యదైవమైన కనకవల్లి, వేదవల్లి సమేత వీరరాఘవస్వామి కలశ పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని బంగారుపేట వేణుగోపాలస్వామి దేవస్థానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కలశ పూజ చేసి, పిండితలిగలు వేసి, వేద పండితుల మంత్రోచ్ఛాణల నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం మహా నైవేద్యం స్వామివారికి సమర్పించారు. రాత్రి గ్రామోత్సవం వేడుకగా సాగింది. మహిళలు పూజలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేడుకల్లో నేదురుమల్లి

పట్టణంలోని బంగారుపేటలో ఉన్న వేణుగోపాలస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వీరరాఘవ స్వామి కలశ పూజ వేడుకల్లో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం పలికి, స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

రుచిగా ఉండాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు

డక్కిలి (బాలాయపల్లె): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నం భోజనం రుచిగా, శుభ్రంగా ఉండాలని ఎంఈఓలు కే వెంకటేశ్వర్లు, ప్రదీప్ తెలిపారు. వాక్యం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం వారు సందర్శించి, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులపై శ్రద్ధ చూపాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సూచనలిస్తున్న సీడీపీఓ శంషాద్ బేగం

డక్కిలి: గర్భిణులకు పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుందని, పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యవంతంగా ఉంటారని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంసాద్ బేగం అన్నారు. డక్కిలి మండలంలోని డీ ఉప్పరపల్లె(గొల్లపల్లె), బాలాయపల్లె మండలంలోని వెంగమాంబపురం, రామాపురం, బాలాయపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అక్కడ చిన్నారులకు నులి పురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పలు రికార్డులు తనిఖీ చేశారు.

బస్సు సర్వీసులు మెరుగుపరుస్తాం

రాపూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసులను మెరుగుపరుస్తామని నెల్లూరు జోన్ డిప్యూటీ చీఫ్ మేనేజర్ ఇబ్రహీం అన్నారు. రాపూరు ఆర్టీసీ డిపో శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం వెంకటగిరి, గూడూరు మార్గాల్లో ప్రయాణికులకు లక్కీడిప్ విజేతలను ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు 70 శాతం ఓఆర్ రావాల్సి ఉందని, అంతకన్న తగ్గితే బస్సు సర్వీసులను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది బస్సు సర్వీసు ఓఆర్ తగ్గకుండా రాబడి తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. రాపూరు నుంచి హైదరాబాద్‌కు మరో రెండు బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాపూరు–నెల్లూరు మార్గంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో డిపో మేనేజర్ అనీల్‌కుమార్,ఎస్‌టీఐ బహీర్‌అహ్మద్, డీసీ రహామాన్, కంటోరలర్ నరసయ్య, విజేతలు ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణీకులు ఉన్నారు.



బహుమతులు అందిస్తున్న ఇబ్రహీం

తెలుగు సంస్కృతి ప్రపంచానికి ఆదర్శం



ప్రవచనాలు చెబుతున్న అనగానంద స్వామీజీ

కోట: మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని ఏలూరు దత్తపీఠం పీఠాధిపతి అనగానంద స్వామీజీ ఉద్బోధించారు. శుక్రవారం స్థానిక కోటమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వామీజీ భక్తులకు తన ఆశీర్వచనాలు అందజేసి ప్రవచనాలు వినిపించారు. ప్రాచీన కాలంగా మన దేశ సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే సేవాభావం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏ రమణయ్య, రమణారెడ్డి, బాబూరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఓ వరం



సైదాపురం: పరీక్షలు చేస్తున్న వైద్యులు



కోట: కేసవరంలో కిట్ అందజేస్తున్న వైద్యులు

సైదాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష రోగుల పాలిట వరమని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. మండలంలోని రామసాగరం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ ముత్తుకూరు వెంకటరత్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలతోపాటు 172 రకాల మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే కంటి పరీక్షలను నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత రాజశేఖర్, ఏఓ పురుషోత్తం శివకుమార్, వైద్యులు శ్రీధర్, శ్రావణి, శాంతి, వివేక్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసవరంలో..

కోట: మండలంలోని కేసవరంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. చిట్టేడు పీహెచ్‌సీ వైద్యాధికారి రాధ ఆధ్వర్యంలో వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వాతి, గురుస్వామి, ప్రసాద్, ఎం సుబ్బయ్య పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏఈఆర్‌ఓలు, సెక్టార్ అధికారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కాంటెస్ట్)పై అవగాహన కల్పించారు. ఆర్డీఓ మాట్లాడుతూ గూడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆరుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుంటారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు సంబంధించి మొత్తం 700 ఈవీఎంలు గూడూరు అసెంబ్లీ నియోజవర్గంలో ఉంటాయన్నారు. అలాగే 31 రూట్‌లను ఏర్పాటు చేసి ఒక్కో రూట్‌కు ఒక్కో సెక్టార్ ఆఫీసర్‌ను నియమించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సెబ్ డీఎస్పీ రమేష్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు జ్ఞాపికల అందజేత

గూడూరురూరల్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాండలేజ్ ఇంటర్నేషనల్ శ్రీసిటీ సౌజన్యంతో శుక్రవారం ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు హాజరైన డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను వేశారు. ఎంఈఓ కాంచన, చిల్లకూరు ఎంఈఓ రవూఫ్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వరప్రసాద్‌రావు, పీడీ శివకుమార్, మ్యాజిక్ బస్ సంస్థ సభ్యులు హరికృష్ణ, సుమంత్, లత, మౌనేంద్ర, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీవైఈఓ

ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సుతో ఉపాధి

తడ: ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సుతో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఒకేషనల్ శిక్షకుడు చిన్నారావు అన్నారు. అక్కంపేట ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరతగతి విద్యార్థులకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఒకేషన్ల్ ఫుడ్ ప్రాసెసింగ్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. పాఠశాల హెచ్ఎం కే సౌజన్య మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు లభించే రంగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం విద్యార్థులు సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేటు బేకరీని సందర్శించి, కేకులు, బిస్కెట్ల తయారీలో మెలకవలు నేర్చుకున్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్లకూరు: మండలంలోని లింగవరంలో ఉన్న రామమందిరం వద్ద శుక్రవారం సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. సీతారాముల కల్యాణం అనంతరం అక్షింతల కోసం యువతీ యువకులు పోటీ పడ్డారు. తరువాత సీతారాములను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జానకి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

గూడూరురూరల్: స్థానిక మిని గురుకులంలో శుక్రవారం రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బహుమతులు, నగదు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకులం హెచ్‌ఎం మేరి ప్రియ, పీఈటీ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు కరిముల్లా ఖాన్, పీఈటీ నాగూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మయూరి శ్యామ్ యాదవ్

టెన్నికాయిట్ అసోసియేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా మయూరి శ్యామ్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని మినిగురుకులంలో టెన్నికాయిట్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పైడి కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా పంతగి భాస్కర్ ఎన్నికయ్యారు.



నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న శ్యామ్‌యాదవ్

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

వెంకటగిరిరూరల్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని అసిస్టెంట్ డిపో మేనేజర్ కేవీ శివాజీ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆర్టీసీ సిబ్బంది, యూనియన్ నాయకులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యంగా ఆర్టీసీ సర్వీసుల నడుపుతున్నట్లు తెలిపారు.

వ్యాధులపై అవగాహన

సూళ్లూరుపేట రూరల్: పట్టణంలోని ఎస్వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం అటకానితిప్పలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెట్లు నాటి, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణాలు, రోడ్లను శుభ్రపరిచారు. గ్రామీణులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి శుభ్రత, పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏడుకొండలు, కళాశాల అధ్యాపకురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

వైవీతో ఎమ్మెల్సీ దంపతుల భేటీ



వైవీ సుబ్బారెడ్డితో బల్లి కళ్యాణ్ దంపతులు

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన వైవీ సుబ్బారెడ్డిని తాడేపల్లెలో శుక్రవారం ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తితో పాటుగా టీటీడీ మెడికల్ అడ్వైజర్ డాక్టర్ శ్వేత మర్యాదపూర్వకంగా కలిశారు. బల్లి కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో సమన్యాయం పాటించి, ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు.

వైభవంగా తెప్పోత్సవం

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరులో ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారి తెప్పోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తై అమావాస్య సందర్భంగా ఉదయం శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.



తెప్పపై విహరిస్తున్న శ్రీకాళహస్తీశ్వరస్వామి

జాతీయ రగ్బీ పోటీలకు రాపూరు విద్యార్థి



పెంచల నరసింహం

రాపూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న పెంచల నరసింహం జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం దయాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 3,4 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి 14 ఏళ్ల లోపు విభాగం రగ్బీ పోటీల్లో పెంచల నరసింహం ప్రతిభ కనపరిచి, జట్టు ద్వితీయ స్థానం సాధించడానికి తోడ్పడారన్నారు. దీంతో పెంచల నరసింహంను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగే రగ్బీ పోటీల్లో పాల్గొంటాడన్నారు. నరసింహంతోపాటు పీఈటీ రమేష్‌ను అభినందించారు.